# పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 17 : పారదర్శక పాలన, సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. తెలంగాణ నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన రోజు సెప్టెంబరు 17ను 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం'గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటికీ దాదాపు 99.52లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారని, దీని ద్వారా మహిళలకు రూ.41.13కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గృహలక్ష్మి పథకం రూ.500లకే గ్యాస్ సిలిండర్లను ఇప్పటి వరకు 59,632 మంది వినియోగదారులకు పంపిణీ చేశామని, ఇందులో భాగంగా రూ.162.70లక్షలు రాయితీ అందించిందన్నారు. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు 1,24,287 జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం రూ.12.81కోట్లు రాయితీ అందజేసినట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 91,092 మంది లబ్ధిదారులు శస్త్రచికిత్సలు, ఇతర వైద్య సేవలు లబ్ధిపొందారని, ఇందుకు ప్రభుత్వం రూ.201.71కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున కట్టించి ఇవ్వనున్నట్లు తెలిపారు. రుణమాఫీకి సంబంధించి అర్హులైన 64,439 మంది రైతుల ఖాతాల్లో రూ.450కోట్లు నగదు జమ చేశామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నష్ట పరిహారానికి మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.3కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 159 నివాస గృహాలకు నష్టం వాటిల్లగా, ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.16,500ల చొప్పున మొత్తం రూ.26.23లక్షలు అందించిందన్నారు. అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ అమర వీరుల, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు సన్మానించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, జిల్లా అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎందరో త్యాగధనుల ఫలితం..

ఎందరో త్యాగధనుల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

# అట్టహాసంగా ప్రజాపాలన దినోత్సవం

జాతీయ పతాకావిష్కరణలో పాల్గొన్న గుర్నాథ్‌రెడ్డి

నారాయణపేట, సెప్టెంబర్ 17 : పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరించారు. విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి కల్పన, అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఐటీ నుంచి అగ్రికల్చర్ వరకు అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నామన్నారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. నారాయణపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో పేట, మక్తల్ ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, అదనపు ఎస్పీ రియాజ్ హుల్‌హక్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతే సర్కారు లక్ష్యం

గోపన్నపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, సెప్టెంబర్ 17 : పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోతులమడుగులో 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం తులమడుగు పరిధిలోని గోపన్నపల్లిలో రేషన్‌దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, ఎంపీడీవో ప్రభాకరాచారి తదితరులు ఉన్నారు.

# ఆత్మ గౌరవాన్ని అవమానిస్తారా?

- పిచ్చోడి చేతిలో రాయిలా తెలంగాణ మారింది
- సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై ఆగ్రహం
- నారాయణపేట, మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ నేతల నిరసనలు
- తెలంగాణ తల్లి చిత్రపటాలు, విగ్రహాలకు క్షీరాభిషేకం

మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్/అర్బన్, సెప్టెంబర్ 17 : తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ తల్లిని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని గ్రంథలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకవైపు సెక్రటేరియట్, బీఆర్ అంబేద్కర్ మరోవైపు తెలంగాణ అమర జ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ అధిష్ఠానం మెప్పు కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణ గౌరవాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. తెలంగాణకు సంబంధంలేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని, ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మహబూబ్‌నగర్, హన్వాడ మండల అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, నాయకులు కొండా లక్ష్మయ్య, గిరిధర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజు, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, సువర్ణ, చెన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**క్షీరాభిషేకం..**

దేవరకద్ర, సెప్టెంబర్ 17 : సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దేవరకద్రలో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్థలం కేటాయించగా, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లిని అవమానపర్చేలా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు డోకూర్ నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, ఆంజనేయులు, బాలరాజు, సయ్యద్‌గౌస్, తిరుపతయ్య, ఖదీర్, గుంతపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతాం..**

మక్తల్, సెప్టెంబర్ 17 : సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజల సంక్షేమానికి పాటుపడాలని బీఆర్ఎస్ నేతల రాజుల ఆసిరెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు నిరసనగా మంగళవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాస ఆవరణలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆసిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించగా, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేస్తూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించే స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సహించరాని విషయమన్నారు. ప్రజా ప్రభుత్వమంటూ అన్నివర్గాలకు మొండిచేయి చూపిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, కౌన్సిలర్ మొగులప్ప, నాయకులు కురుమయ్య, శంకర్, ఎల్లారెడ్డి, అన్వర్ హుస్సేన్, వెంకట్‌రెడ్డి ,మన్నన్, సోంభుపాల్‌గౌడ్, రవికుమార్, కృష్ణయాదవ్, ఈశ్వర్‌యాదవ్, అశోక్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

**మద్దూర్‌లో..**

మద్దూర్ (కొత్తపల్లి)సెప్టెంబర్17: మద్దూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, శివకుమార్, నారాయణ, రాములు, చారి, జనార్దన్, దాసు, రఫీ, బసంత్‌రెడ్డి, ఫీర్‌అహ్మద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కోస్గిలో..**

కోస్గి, సెప్టెంబర్ 17 : పట్టణంలోని శివాజీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ శాసం రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టి తెలంగాణ సమాజాన్ని రేవంత్ అవమానించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సింహులు, సాయప్ప, వీరభద్రప్ప, మాజీ ఎంపీటీసీ పోషప్ప, మోహన్, బాలరాజు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మద్దూర్ : క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోస్గి శివాజీ చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## తెలంగాణ విమోచన దినోత్సవం

జాతీయపతాకాన్ని ఎగురవేసిన ఏబీవీపీ నాయకులు

జడ్చర్ల/మాగనూరు/మిడ్జిల్, సెప్టెంబర్ 17 : విమోచన దినోత్సవాన్ని సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. శాంతినగర్‌లోని వివేకానంద విగ్రహం వద్ద జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేశ్, రాఘవేందర్, వీరమోహన్, శోభారాణి, నవనీత, పద్మావతి, నవ్య, అశోక్ తదితరులు ఉన్నారు. మాగనూరులో బీజేపీ మాజీ ఎంపీపీ శ్యామలమ్మ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. మిడ్జిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం నిర్వహించారు.

## పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 17 : పాడి రైతులు మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ అధ్యక్షుడు, రైతులు మాట్లాడుతూ.. ఐదు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం 6వ బిల్లు నడుస్తున్నదన్నారు. దాదాపు రూ.2కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు బకాయి ఉందన్నారు. పాడిరైతులకు న్యాయం చేయాలని కోరారు.

మంత్రి జూపల్లి కృష్ణారావుకు సమస్యలు నివేదిస్తున్న పాడి రైతులు

# విశ్వకర్మలకు చేయూతనందిస్తాం

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పూజలు చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/కృష్ణ, సెప్టెంబర్ 17 : విశ్వకర్మలకు చేయూతనందిస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మఖ్తల్ పట్టణంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా యజ్ఞ మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీహరి హాజరై పూజలు చేశారు. అంతకుముందు విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో నల్లజానమ్మ ఆలయం నుంచి మానేశ్వర ఆలయం వరకు స్వామివారి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ నరేందర్ సహకారంతో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెడల్‌తోపాటు వెండి నాణెం, జ్ఞాపిక బహూకరించారు. అలాగే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. కృష్ణ మండలంలోని గుడెబల్లూర్ పంచాయితీ పరిధిలోని టైరోడ్ చౌరస్తా వద్ద తెలంగాణతల్లి విగ్రహానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించారు.

**జడ్చర్లలో..**

జడ్చర్ల, సెప్టెంబర్ 17 : విశ్వకర్మ పంచదాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్లలో విశ్వకర్మ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగాపూర్ రోడ్డులోగల వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. అదేవిధంగా అంతకుముందు మూలవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ విగ్రహాలకు అభిషేకం చేసి సుప్రభాతసేవ నిర్వహించారు. యజ్ఞం అనంతరం అన్నదాన కార్యక్రటమం చేపట్టారు. కార్యక్రమంలో విశ్వకర్మ పంచదాయుల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు అమర్‌నాథ్‌గుప్తా, సతీష్, శేఖర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బాలానగర్ మండలంలో..**

బాలానగర్, సెప్టెంబర్ 17 : విశ్వకర్మ జయంతి ఉత్సవాలను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటంతో బాలానగర్ వీధుల్లో పల్లకీసేవ చేపట్టారు. మాజీ వైస్ ఎంపీపీ వెంకటాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ మహాయాగం నిర్వహించారు. మాధవాచారి, విష్ణుమూర్తి, చక్రంచారి, మాధవాచారి, మహిళలు పాల్గొన్నారు.

**మహ్మదాబాద్‌లో..**

మహ్మదాబాద్, సెప్టెంబర్ 17 : విశ్వకర్మ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు విశ్వకర్మ సంఘం, విశ్వబ్రాహ్మణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**దేవరకద్రలో..**

దేవరకద్ర, సెప్టెంబర్ 17 : మండల కేంద్రంలో మంగళవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువు వద్ద గల విశ్వకర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, రత్నయ్యచారి, లక్ష్మీనారాయణ, వెంకటయ్య, రవీందర్‌చారి, చంద్రమౌళి, అర్జున్‌చారి తదితరులు పాల్గొన్నారు.

**మరికల్‌లో..**

మరికల్, సెప్టెంబర్ 17 : విశ్వకర్మ జయంతిని మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో ఘనంగా నిర్వహించారు.

# పండుగలు ఐక్యతకు నిదర్శనం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తా వద్ద భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పాలమూరు, సెప్టెంబర్ 17 : పండుగలు ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గడియారం చౌరస్తా నుంచి మొట్టుగడ్డ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే యెన్నం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అలీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

**మిలాద్ ఉన్ నబీ ర్యాలీ**

జడ్చర్ల, సెప్టెంబర్ 17 : పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ప్రధాన రహదారులపై షర్బత్‌స్టాళ్లను ఏర్పాటు చేశారు. మైమన్ మసీదు నుంచి నిమ్మబావిగడ్డ మీదుగా కావేరమ్మపేట జామే మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ జానకి బందోబస్తును పరిశీలించారు.

జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

# గంగమ్మ ఒడికి గణనాథులు

మరికల్‌లో నిమజ్జనానికి గణనాథుడిని తరలిస్తున్న భక్తులు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 17 : పట్టణంలోని వివిధ మండపాల్లో 10రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథులను సోమవారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. యువకులు, మండపాల నిర్వాహకులు, భక్తులు భజనలు, పాటలకు నృత్యాలు చేయగా, పట్టణంలోని గణేశ్ మార్గ్ మీదుగా శోభాయాత్రను వైభవంగా చేపట్టారు. శోభాయత్రలో పురాణ, ఇతిహాసాలు ప్రస్తుత సంఘటనలు, కదులుతున్న బొమ్మలతో చేసిన అలంకరణలు చూపరులను ఆకట్టుకున్నాయి. చౌక్ బజార్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్వాగత సభ ఏర్పాటు చేసి శోభాయాత్రలో పాల్గొన్న గణనాథులకు స్వాగతం పలికారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో, శక్తిపీఠం ఆధ్వర్యంలో శోభాయాతను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కోస్గిలో లడ్డూ వేలం రూ.6.99లక్షలు**

కోస్గి, సెప్టెంబర్ 17 : పట్టణంలోని తెలుగువీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం రికార్డు స్థాయిలో పలికింది. మంగళవారం నిర్వహించిన వేలం పాటలో ముదిరాజ్ సంఘం నాయకులు రూ.6లక్షల 99వేలకు సొంతం చేసుకున్నారు.

**అమ్మాపూర్‌లో రూ.లక్ష**

నవాబ్‌పేట, సెప్టెంబర్ 17 : మండలంలోని అమ్మాపూర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశ్ లడ్డూ రికార్డు ధర పలికింది. నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు నిర్వహించిన వేలంలో అంకూరి రామస్వామి, గుమ్మడి చెన్నకేశవులు రూ.లక్షా 116లకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, నాయకులు యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం**

దేవరకద్ర, సెప్టెంబర్ 17 : మండలంలోని బల్సుపల్లి, గోపన్‌పల్లి తదితర గ్రామాల్లో గణనాథులను మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. బల్సుపల్లిలో గణేశ్ లడ్డూ వేలం పాట నిర్వహించగా, నరేశ్ రూ.49,500లకు దక్కించుకున్నాడు.

**బాలానగర్‌లో..**

బాలానగర్, సెప్టెంబర్ 17 : మండలంలోని గౌతాపూర్, గంగాదర్‌పల్లి, పెద్దరేవల్లి, వనంవానిగూడ, గుండేడు గ్రామాల్లో మంగళవారం వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసిన గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలు, గ్రామస్తులకు అన్నదానం చేశారు. అనంతరం వినాయక విగ్రహాలను సమీపంలోని చెరువులు, బీచుపల్లి, శ్రీశైలం తదితర ప్రాంతాలకు నిమజ్జనానికి తరలించారు.

**అన్నదానం..**

కృష్ణ, సెప్టెంబర్ 17 : మండలంలోని ముడుమాల, కున్సి, గుడెబల్లూర్‌లో వినాయక మండపాల వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

**మరికల్‌లో..**

మరికల్/ధన్వాడ, సెప్టెంబర్ 17 : మండల కేంద్రంలోని పటేల్ రోడ్డు, కుర్వగేరిలో ఏర్పాటు చేసిన వినాయకులను మంగళవారం నిమజ్జనానికి తరలించారు. అలాగే ధన్వాడలో నిమజ్జనానికి తరలిచారు.

నారాయణపేట నుంచి నిమజ్జనానికి గణనాథులను తరలిస్తున్న దృశ్యం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, FAISAL BIN MOHSIN AL AUBASANI, S/o MOHSIN BIN HASAN R/o H.No:1-5-29/1/A, Hashmi Street, Newtown , Mahabubnagar Town and Dist Mahabubnagar T.G., hereby declare that I, have changed my name from FAISAL BIN MOSIN (old name) to FAISAL BIN MOHSIN AL AUBASANI S/o MOHSIN BIN HASAN (new name).

NT-MBNR

CHANGE OF NAME

★I, NEMATHUNISSA BEGUM, R/o. 2-9-36, Market Road Clock Tower, Mahbubnagar-509 001, T.S. I have Changed My Name as "NEMATH UNNISA, W/o. Mohammad Yousuf".

NT-335814

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331771-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748